



చిత్తూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

● ముగ్గురు యువకులు మృతి

పోలీస్ అంటే నమ్మకం పెరగాలి: డిఐజి రవిప్రకాష్



ప్రజాశక్తి – చిత్తూరు అర్బన్: అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాలలోని సిఐ, ఆపై స్థాయి పోలీసు అధికారులతో రేంజ్ డిఐజి ఎం.రవిప్రకాష్ ఆదివారం సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల తీరు మంచిగా ఉండాలని, పోలీసులు ఉన్నారంటే లా అండ్ ఆర్డర్ పక్కాగా ఉండాలని, ప్రజలకు భరోసా కలిగించాలన్నారు. రోడ్లపై బూతులు మాట్లాడటం, తిట్టడం సరైంది కాదని అన్నారు. వ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని కోల్పోయేలా ప్రవర్తించరాదని సూచించారు. ప్రజల్లో చెడుగా ప్రవర్తించడం, అనవసరంగా లాఠీఛార్జి చేయడం చేస్తే సహించమని, చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టపరంగా వ్యవహరించాలని, రేంజ్ పరిధిలోని ఎస్పీలు పోలీసులు అధికారులు సిబ్బందితో సెల్ కాన్ఫరెన్స్ లేదా జూమ్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించి ప్రజలతో ఎలా మెలగాలి, పోలీసులు ఎలా చట్టపరంగా వ్యవహరించాలో దిశానిర్ధేశం చేయాలన్నారు. మున్ముందు రెచ్చగొట్టే ఘటనలు ఎదురుకావచ్చు కానీ రెచ్చపోకూడదని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాజకీయాల జోలికెళ్లకూడదు. చట్టపరంగా కాకుండా స్వార్థంగా వ్యవహరిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు తెస్తే ఎవర్నీ ఉపేక్షించేది లేదన్నారు. ఏ అధికారి అయినా కస్టోడియల్ హింసకు పాల్పడినా, ప్రజల్ని ఇబ్బందులు పెట్టే హీరోయిజం చూపించినా, చట్ట వ్యతిరేకంగా వ్యవహరించడం చేస్తే ఊరుకోమని అన్నారు. కోర్టు విషయాలకు సంబంధించిన రిప్లైలు ప్రాపర్‌గా పంపేలా అదనపు ఎస్పీలు కృషి చేయాలన్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్పీలు డాక్టర్ ఫక్కీరప్ప, రాహుల్ దేవ్ సింగ్, పరమేశ్వరరెడ్డి, రిషాంత్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానాలతో... విద్యా వ్యవస్థ నిర్వీర్యం

● ఐక్య పోరాటాలకు సిద్ధం కండి ● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విఠపు పిలుపు ● శ్రీకాళహస్తిలో ఘనంగా యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సభలు

ప్రజాశక్తి – శ్రీకాళహస్తి :

ప్రపంచ బ్యాంకుకు తలొగ్గి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నూతన విద్యావిధానాల వల్ల ఉపాధ్యాయ, విద్యారంగం ప్రమాదంలో పడిందని తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. ఈ నూతన విద్యా సంస్కరణలను ప్రతిఘటించకుంటే ఉపాధ్యాయులు కట్టు కట్టుబానిసల్లాగా మారే అవకాశం ఉందనీ, 2026 నాటికి ఎస్జీటీలు కనుమరుగైనా ఆశ్చర్యపోనక్కర్లేదని హెచ్చరించారు. పట్టణంలోని స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో ఆదివారం యుటిఎఫ్ తిరుపతి జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం యూటీఎఫ్ పతాకావిష్కరణ అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కౌన్సిల్ సమావేశాలను ప్రారంభించారు. ఈ సమావేశాలనుద్దేశించి ఎమ్మెల్సీ విఠపు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ఇటీవల కాలంలో తీవ్రమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. ప్రపంచ బ్యాంకుకు తలొగ్గి కేంద్రం, కేంద్రానికి తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద నూతన విద్యాసంస్కరణలను అమలు చేస్తోందని తెలిపారు. ఫలితంగా ప్రాథమిక విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. 3,4,5 తరగతుల విలీనం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పది లోపు విద్యార్థులే ఉన్న 2వేలకు పైగా ప్రాథమిక పాఠశాలున్నాయనీ, వీటన్నిటినీ త్వరలో మూసివేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని వాపోయారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 4వేల స్కూళ్లకు మాత్రమే మ్యాపింగ్ చేసిందనీ, తద్వారా 26వేల ఉపాధ్యాయ పోస్టులను కోల్పోయే ప్రమాదం వచ్చిందని వివరించారు. జగన్ ఇంగ్లీష్ మీడియం, బైజుస్ అంటూ ప్రాథమిక విద్యా వ్యవస్థను గాలికొదిలేశాడని ధ్వజమెత్తారు. అన్ క్వాలిఫైడ్ టీచర్లతో ప్రాథమిక విద్యావ్యవస్థను నెట్టుకురావడం జగన్ ఉద్దేశమని అన్నారు. విద్యావ్యవస్థ చరిత్రలో ఉపాధ్యాయ పోస్టులు పెరుగుతూ వచ్చాయే తప్ప తరగడం ఎన్నడూ చూడలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ వర్గాన్ని శత్రు వర్గంగా చూస్తోందనీ, అందుకే వారిపై కక్షగట్టి బోధనేతర పనులను అప్పజెప్పుతోందంటూ మండిపడ్డారు. ప్రత్యామ్నాయ విద్యావిధానాల అమలులో ఏపీ తమిళనాడు రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నూతన విద్యావిధానాలను తిరస్కరించడమే కాకుండా ప్రత్యామ్నాయ విద్యావిధానాన్ని అమలు చేస్తే తీరుతామంటూ కేంద్రానికి స్పష్టం చేయడం అనుసరణీయమని అన్నారు. ఆ తరహా ప్రత్యామ్నాయ విద్యావిధానాల వైపు ఏపీ అడుగేయకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ బ్యాంకు విద్యావిధానాలను అనుసరిస్తూ పోతే చివరకు ప్రభుత్వ బడుల్లో రెగ్యులర్ టీచర్లే ఉండరనీ, ఒప్పంద ఉపాధ్యాయులను పెట్టి వెట్టిచాకిరి చేయించుకోవడం తధ్యమన్నారు. ఇకనైనా ఉపాధ్యాయులు ఐక్యంగా ఉండి వారి హక్కులను సాధించుకోవడమే కాకుండా, మెరుగైన విద్యావ్యవస్థ నిర్మాణానికి కారణభూతులు కావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ అంటే ఒక నిజం అని చాటిచెప్పేలా కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. సూర్య కేంద్రసిద్ధాంతాన్ని ప్రపంచానికి తెలియజేసిన శాస్త్రవేత్త లినార్డ్ బ్రూనోను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులకు సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకూ, బకాయలు చెల్లించే వరకూ, ఏటా డీఎస్సీ నోటిఫికేషన్, ఉపాధ్యాయ ఖాళీలను పూరించే వరకు యూటీఎఫ్ కార్యకర్తల పోరాటం ఆగకూడదని స్పష్టం చేశారు. పిడిఎఫ్ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబిరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, ప్రధానకార్యదర్శి ముత్యాలరెడ్డి, నాయకులు జి.శ్రీనివాసులు, సూర్యప్రకాష్, జయంతి, సునీల, వెంకటకష్ణ, విజయ్ కుమార్, రాజేష్, దామోదర శెట్టి, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

ఉద్యమ గొంతుకను గెలిపించండి: పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పొక్కిరెడ్డి, మీగడ



రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కార్మిక, కర్షక, నిరుద్యోగ, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల గొంతుకై నిలిచే పిడిఎఫ్ ఉద్యమ అభ్యర్థులను గెలిపించాలని పొక్కిరెడ్డి బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి ఆదివారం వారిరువురు మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. సిపిఎస్ రద్దు, ఓపిఎస్ అమలుకు పిడిఎఫ్ అభ్యర్థులు శక్తి వంచన లేకుండా కషి చేస్తారని చెప్పారు. నూతన విద్యావిధానం పేరుతో పాఠశాలల కుదింపు, పోస్టుల తగ్గింపుపై విస్తత ఉద్యమం చేపడతామన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులకు, సిబ్బందికి గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు, సంక్షేమ నిధిని ఏర్పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వంటి వెట్టిచాకిరీ విధానాల రద్దుకు పోరాటం చేస్తామన్నారు. ఉపాధ్యాయులు పట్టభద్రులు వారి మొదటి ప్రాధాన్యతా ఓటును పిడిఎఫ్ అభ్యర్థులకే వేసి గెలిపించాలని కోరారు.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా బండి మధుసూదన రెడ్డి ఎంపిక

తిరుపతి టౌన్: తిరుపతి జిల్లా యుటిఎఫ్ ప్రథమ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం శ్రీకాళహస్తిలోని ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్లు జరిగాయి. ఎన్నికల అధికారిగా రాష్ట్రకార్యదర్శి లక్ష్మీరాజా నిర్వహించారు. ఎన్నికల కార్యక్రమంలో తిరుపతి అర్బన్ సంబంధించి జిల్లా కార్యదర్శిగా బండి మధుసూదన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపిద్దాం..

సిఐటియు, ఎఐటియుసి నేతల పిలుపు

ప్రజాశక్తి – చిత్తూరుఅర్బన్:

ప్రశ్నించే గొంతుకలు పిడిఎఫ్ అభ్యర్థుల విజయం కోసం సమిష్టిగా కృషిచేయాలని సిఐటియు, ఎఐటియుసి నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో శాసన మండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థుల విజయం కోసం సమిష్టి కృషిపై సిఐటియు, ఎఐటియుసి నాయకుల సమావేశం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్లు మద్దతుతో పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులు బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డిలను గెలిపించాలని నాయకులు పిలుపునిచ్చారు. అధికారపార్టీ ప్రలోభాలు, అధికార దుర్వినియోగాన్ని సమర్థవంతంగా ఎదుర్కొవాలని రాష్ట్రనాయకులు దడాల సుబ్బారావు పిలుపునిచ్చారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికవ్యతిరేక విధానాలను శాసన మండలిలో ప్రశ్నించే పిడిఎఫ్ ఎంఎల్‌సి విజయం సాధించడం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల సమస్యలతో పాటు అనగారిన వర్గాల గళం వినిపించే అవకాశముంటుందని అన్నారు. ఈసమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య, వాడ గంగరాజు, ప్రసాద్, ఎఐటియుసి నాయకులు నాగరాజు, గోపినాథ్, సత్యమూర్తి, విజయగౌరి, రమాదేవి, జమీలాభిలు పాల్గొన్నారు.



పిడిఎఫ్ అభ్యర్థుల విజయంపై సిఐటియు, ఎఐటియుసి నేతల సమావేశం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

ప్రజాశక్తి – చిత్తూరుఅర్బన్: అరగొండ జడ్పీ హైస్కూల్లో పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. మండలంలోని అరగొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1983,84 బ్యాచ్ 10వ తరగతి విద్యను అభ్యసించిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం నుంచి కాకుండా వివిధ ప్రాంతాలు దేశాలు విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ పాఠశాలలో కలుసుకున్నారు. ఈసందర్భంగా అందరూ ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ పాఠశాలలో గడిపిన మధుర క్షణాలను జ్ఞాపకం చేసుకున్నారు. పూర్వ విద్యార్థుల తరపున పాఠశాలకు డెస్కాప్ కంప్యూటర్‌ను విరాళంగా అందజేశారు. అలాగే ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు.

పీఈఎస్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి – చిత్తూరుఅర్బన్: పిఈఎస్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి కుప్పం వారిచే ఆదివారం స్థానిక ఒరిగిపల్లి వద్ద ఉన్న పిఈఎస్ పబ్లిక్ పాఠశాలలో ఉచిత మెగా వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గుండె వైద్యం, నరాల శస్త్రచికిత్స వైద్యం, కిడ్నీవ్యాధుల చికిత్స, మూత్రకోశ వ్యాధుల చికిత్స, మధుమేహం, సాధారణ వైద్యం, చిన్నపిల్లల వైద్యం, జనరల్ సర్జరీ శస్త్ర చికిత్స వైద్యం, ఎముకలు, కీళ్లవైద్యం, కంటి వైద్యం, చెవి, ముక్కు, గొంతు వైద్యం, స్త్రీ గర్భకోశ వైద్యం, చర్మవ్యాధులు, శ్వాసకోసవైద్యం, దంత వైద్యం మొదలగు విభాగాలకు సంబంధించిన వైద్య పరీక్షలు దాదాపు 2,091 మందికి చేయడం జరిగిందన్నారు. ఇందులో 236మందికి వివిధ విభాగాలకు సంబంధించి ప్రత్యేక వైద్యం అందించడం జరిగిందన్నారు. షుగరు, బిపి, ఈసిజి, ఎకో, టిబి, హిమోగ్లోబిన్ మొదలైన పరీక్షలు నిర్వహించారు. పిఈఎస్ మెడికల్ కళాశాల ఆసుపత్రి 2001వ సంవత్సరంలో ప్రారంభమై, అంచెలంచెలుగా ఎదుగుతూ చిత్తూరు జిల్లా ప్రజలకు ఎనలేని సేవలను అందిస్తోందన్నారు. ఈకార్యక్రమానికి విచ్చేసిన పుర ప్రజలకు, వివిధ విభాగాల్లో పరీక్షలు నిర్వహించి తగు సూచనలను ఇస్తూ, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిత్తూరు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే ప్రథమ ధ్యేయంగా ఎంచుకున్న పీఈఎస్ విద్యాసంస్థల కులపతి డాక్టర్ ఎంఆర్.దొరస్వామి సేవా దక్పథమే గొప్పదని అన్నారు. అలాగే పిఈఎస్ విద్యాసంస్థల అధినేత ఎంఆర్.దొరస్వామి మాట్లాడుతూ నిత్యం, ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక వ్యాయామం తప్పనిసరి అన్నారు. ఎప్పుడూ మంచి ఆలోచనలు చేస్తే అనారోగ్యం దరిచేరదని, ఆరోగ్యం లేని మనిషి జీవితంలో ఏది సాధించలేరని, వైద్యుల సూచనలను పాటించి ఆరోగ్యవంతులు కావాలన్నారు. ఇక నుండి ప్రతి సంవత్సరం తన తండ్రిగారు మేదరమెట్ల రామానాయుడు జ్ఞాపకార్థం ఉచిత మెగా వైద్యసేవలు పునరావత్తం అవుతాయని తెలిపారు. ప్రతి సంవత్సరం ఆసేవలను సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు. కార్యక్రమంలో పిఈఎస్ పబ్లిక్ పాఠశాల యాజమాన్యం, పిఈఎస్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సీనియర్ వైద్యవిభాగ అధికారులు, టెక్నీషియన్స్, నర్సులు, పురప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ

సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలి



విజయవాడ సభకు హాజరైన చిత్తూరు జిల్లా ఎపి ఎన్‌జీవో సంఘం నాయకులు

ప్రజాశక్తి – చిత్తూరుఅర్బన్:

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘువులు, రఘు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎన్‌జీవో సంఘం సమావేశంలో చిత్తూరు జిల్లా నుంచి ఎన్‌జీవో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్రస్థాయి సమావేశంలో చర్చించారు. ప్రభుత్వం వెంటనే సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సమావేశం డిమాండ్ చేసిన్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో చిత్తూరు ఎన్‌జీవో సంఘం నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర సమావేశం విజయవంతమైందని రానున్న రోజుల్లో సిపిఎస్ రద్దుతో పాటు ఉద్యోగులు సమస్యలపై పోరాటాలు తీవ్రతరం చేయనున్నట్లు తెలిపారు.

అధికార పార్టీ వర్గీయుల మధ్య ఘర్షణ

ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి – చిత్తూరుఅర్బన్: స్థానిక సంతపేటలో వైసిపి వర్గీయుల మధ్య ఘర్షణలో ఐదుగురు గాయపడ్డ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు స్థానిక ఓ వైసిపి నాయకులు భూకబ్జాలకు పాల్పడుతుంటే స్థానిక కోడిగుట్టకు చెందిన వెంకటేష్, సుబ్రమణ్యం, రమేష్, చైతన్య, చంద్రలు ప్రశ్నించడంతో పాటు ప్రతిఘటిస్తుంటే సహించలేక తన అనుచరులతో ఆదివారం 42వ డివిజన్ సచివాలయం వద్ద దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. గతంలో కూడా సంతపేటలో ఈ వర్గాల మధ్య దాడులు చోటు చేసుకున్నాయి, నేడు జరిగిన దాడిలో ఐదుగురికి గాయాలైయ్యాయి. రమేష్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వేలూరు సిఎంసికి తరలించారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదిలో ఉత్తమ మార్కులు సాధించాలి

సాంఘిక సంక్షమశాఖ జేడీ నాగేశ్వరరావు



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి – చిత్తూరుఅర్బన్: స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖలకు చెందిన హాస్టల్ విద్యార్థులకు పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించడానికి అవసరమైన సూచనలను సబ్జెక్టు నిపునులచే విజయం విద్యాసంస్థలలో ఆదివారం తరగతుల నిర్వహించారు. ఈ తరగతులకు చిత్తూరు, జీడి నెల్లూరు, నగరికి చెందిన రెండు వందలమంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి డి.రాజ్యలక్ష్మి పాల్గొని విద్యార్థులకు విజయసాధన పుస్తకాలను పంపిణీ చేశారు. హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘికసంక్షేమ అధికారులు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, హాస్టల్ అధికారులు రాజశేఖర్, ఏకాంబరం, నవీన్‌రెడ్డి, అన్నపూర్ణ పాల్గొన్నారు. విజయసాధన పుస్తకాలను, పివికేఎన్ వాకర్స్ అసోసియేషన్ లీడర్స్ దయానందరెడ్డి, శివశంకర రెడ్డి, విశ్వనాథ పాల్గొన్నారు.

'క్యాంఫర్డ్'లో ఘనంగా విద్యావినోద వేడుకలు

ప్రజాశక్తి – చిత్తూరుఅర్బన్: గంగనపల్లిలోని క్యాంఫర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలో విద్యార్థులకు విద్యా, సామాజిక పరికల్పన అభివృద్ధి ప్రధానోద్దేశంతో విద్యావినోద వేడుకలు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో పాఠశాలల అధినేత సిఆర్ మహేష్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లోని అభిరుచికి తార్కాణమైన ఈకార్యక్రమం ఎంతో విజయవంతమైందని తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా పాఠశాల ఛైర్‌పర్సన్ కీర్తీ మహేష్, డైరెక్టర్ దీక్ష, అక్షయ్‌లు పాల్గొన్నారు. పోషకాహార ప్రదర్శనలు, ఫన్‌గేమ్స్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బుర్రకథ, నాటికలు ప్రదర్శించారు. పిల్లలు కేవలం చదువు ఆటలే కాకుండా మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో సహకరిస్తాయని డైరెక్టర్ దీక్ష తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సీతాశేఖర్, కోఆర్డినేటర్లు ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తండ్రిపై కన్నకొడుకు దాడి

ప్రజాశక్తి – చిత్తూరుఅర్బన్: ప్రియురాలి వ్యవహారంలో తండ్రి ప్రశ్నించడంతో కన్నకొడుకే తండ్రిపై దాడిచేసి గాయపరచిన సంఘటన ఆదివారం చిత్తూరు నగరంలో గాంధీరోడ్డులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ఢిల్లీబాబు తన కుమారుడు భరత్‌ను ప్రేమ వ్యవహారంలో ఇలాంటి తప్పుడు పనులు చేయవద్దని బెదిరించాడు. దీంతో ఆగ్రహించిన ప్రియురాలికి వీడియో తన తండ్రిని కొడుతున్న దృశ్యాలను చూపుతూ ఇనుప రాడ్డుతో తీవ్రంగా కొట్టి గాయపరచి పరారయ్యాడు. గాయపడ్డ ఢిల్లీబాబు చిత్తూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా

● తిరుపతి రూరల్‌లో లోకేష్ పాదయాత్ర ● తనపల్లి లెవల్‌కాజ్‌వే పరిశీలన

ప్రజాశక్తి – తిరుపతి సిటి :

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో నిర్వహిస్తున్న పాదయాత్ర ఆదివారం తిరుపతి రూరల్‌లో కొనసాగింది. తిరుచానూరులోని అయ్యప్ప ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బస కేంద్రం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర తిరుచానూరు, వసుందరనగర్, తనపల్లి, భాగ్యనగరం, కూపుచంద్రపేట, దుర్గసముద్రం, అడపారెడ్డిపల్లి, శివగిరి వద్ద ఏర్పాటు చేసిన బస కేంద్రం వరకు సాగింది. ఆదివారం ఉదయం పాదయాత్ర ప్రారంభించిన 10నిమిషాల తర్వాత తిరుచానూరు అమ్మవారిని దర్శించుకున్నారు. అదే పంచాయతీలో ప్రజలతో ముఖాముఖి, వసుందర నగర్ వాసులతో మాటామంతి, తనపల్లిలో రైతులతో సమావేశం, భాగ్యనగరంలో భోజన విరామం, అనంతరం అక్కడే బిసి సామాజికవర్గాలతో సమావేశంలో కూపుచంద్రపేటలో, దుర్గసముద్రం వద్ద, అడపారెడ్డిపల్లి వద్ద స్థానికులతో మాటామంతి అనంతరం శివగిరి బస కేంద్రానికి చేరుకున్నారు. పాదయాత్రలో భాగంగా తనపల్లిలో ఇటీవల కొట్టుకపోయిన లెవల్‌కాజ్‌వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమర్థ వైసిపి పాలన, అవగాహనలేని సిఎం జగన్ వల్ల నేడు రాష్ట్రానికి ఈ దుస్థితి వచ్చిందన్నారు. వర్షాకాలంలో కనీస అంచనాలు లేకుండా జగన్ ప్యాలస్‌లో పడుకోవడం వల్ల అన్నమయ్య డ్యాం కొట్టుకపోయిందని, 60 మందిని జగన్ పొట్టనపెట్టుకున్నారని విమర్శించారు. నీటి నిర్వాహణలో జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. స్వర్ణముఖి నదిపై ఉన్న 7లో లెవల్ కాజ్‌వేలు వరదల్లో దెబ్బతిన్నాయని, తాత్కాలికంగా మట్టి, పైపులు వేసి జగన్ ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. వీటి వలన ప్రజలకు ప్రమాదం పొంది ఉందన్నారు, చిన్న వర్షం వచ్చిన కొట్టుకపోయే ప్రమాదం ఉందన్నారు. కాజ్‌వేలు కొట్టుకుపోయి ఏడాది అవుతున్న ప్రభుత్వం శాశ్వత పరిస్కారానికి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ సమస్యని శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, పులివర్తి నాని, మాజీ ఎంఎల్‌ఏ సుగుణమ్మ, ఈశ్వర్‌రెడ్డి, పి.మోహన్, పులివర్తి వినిల్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ లను పరిష్కరిస్తా : నారా లోకేష్

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని నారా లోకేష్ ప్రకటించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర 28వ రోజు ఆదివారం తిరుపతి రూరల్, రామచంద్రపురం మండలంలో సాగింది. ఈ సందర్భంగా కొన్ని ఉపాధ్యాయ సంఘాలు నారా లోకేష్ కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని వివరించారు. సిపిబస్ విధానాన్ని రద్దుచేసి ఓపిబస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని రద్దుచేయాలి విన్నవించారు. ఉపాధ్యాయ బదిలీలకు స్పష్టమైన శాశ్వత విధివిధానాలను రూపొందించాలని చెప్పారు. ప్రతినెలా 1వ తేదీన జీతాలు వచ్చేటట్లు చట్టం చేయాలని కోరారు. అలాగే ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని రద్దుపరచి బయోమెట్రిక్ విధానాన్ని అమలు పరచాలని, యాప్ భారాన్ని తగ్గించి వాటిని సచివాలయ ఉద్యోగులకు అనుసంధానం చేయాలని కోరారు. లోకేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను ఇదివరకెన్నడూ లేనివిధంగా వేధింపులకు గురిచేస్తున్న రాక్షసుడు జగన్ రెడ్డి అన్నారు. పవిత్రమైన వత్తిలో ఉన్న గురువులతో మందుషాపులవద్ద కాపలా పెట్టిన నీచుడు ఈ ముఖ్యమంత్రి అని దూషించాడు. తమ హక్కుల కోసం న్యాయపోరాటం చేస్తున్న టీచర్లపై ఉగ్రవాదుల మాదిరిగా తప్పుడు కేసులుపెట్టి వేధించిన ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేదని చెప్పారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామన్నారు. టీచర్లు ఎటువంటి వేధింపులు లేకుండా స్వేచ్ఛగా పనిచేసుకునే వాతావరణం కల్పిస్తామని హామీ ఇచ్చారు.





లోకేష్‌కు సమస్యల గురించి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

లోకేష్ బస ముందు వైసిపి నిరసన

తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర బస కేంద్రం వద్ద వైసిపి నాయకులు ఆదివారం నిరసనకు దిగారు. నారా లోకేష్ పాదయాత్ర శనివారం తిరుపతి అర్బన్ నుంచి రాత్రి తిరుపతి రూరల్‌లోని తిరుచానూరు వద్దనున్న అయ్యప్ప ఆలయం వద్ద వరకు సాగింది. అనంతరం ఆయన అక్కడే ఏర్పాటు చేసిన కేంద్రంలో బస చేశారు. శనివారం పాదయాత్రలో తిరుపతి ఎంఎల్‌ఏ భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన తనయుడు భూమన అభినయ్‌రెడ్డిని ఉద్దేశించి నారా లోకేష్ తిరుపతికి ఇద్దరు ఎంఎల్‌ఏలు అని ఎద్దేవా చేసిన విషయం విధితమే. ఈ మాటలను వ్యతిరేకిస్తూ వైసిపి యువజన నాయకులు పెద్దఎత్తున లోకేష్ బస చేసే ప్రాంతానికి చేరుకుని, ఆయన బస చేస్తున్న ఏసి కంటైనర్ వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వైసిపి యువజన నాయకులు బాలిశెట్టి కిషోర్ మాట్లాడుతూ విలాసవంతమైన సూపర్‌లగ్జరి ఎయిర్ కండీషనర్ కంటైనర్‌లో విశ్రాంతి తీసుకుంటున్న లోకేష్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. తిరుపతి అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదని విమర్శించారు. పబ్లిసిటి కోసం ఎంఎల్‌ఏ, ఆయన కుమారుడుపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు లోకేష్ రెండో సిఎంగా వ్యవహరించారని ఎద్దువా చేశారు. అందరూ అలాగే వ్యవహరిస్తారనుకోవడం వారి అవివేకమన్నారు. అనంతరం పోలీసులు వారికి సర్ధిచెప్పి అక్కడ నుంచి పంపివేశారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ వంశీ, వాసుయాదవ్, ఇరగం అనిల్‌రెడ్డి, మద్దాలి శేఖర్‌రాయల్, మైలం శ్రీకాంత్‌రెడ్డి, సూరి, సుభాష్, ప్రదీఫ్, చందు, గోవర్ధన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ యువగళం పాదయాత్ర వివరాలు

ఇప్పటి వరకు నడిచిన దూరం కి.మీ. 367.3 కి.మీ.

28వ రోజు ఆదివారం నడిచిన దూరం –13.2 కి.మీ.

యువగళం పాదయాత్ర 29వ రోజు షెడ్యూల్ (27-2-2023)

చంద్రగిరి నియోజకవర్గం:

ఉదయం 8 గంటలకు చంద్రగిరి మండలం శివగిరి విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభం. 9.15గంటలకు శానంబట్ల గ్రామంలో స్థానికులతో మాటామంతీ, 10.20 గంటకలు పిచ్చినాయుడుపల్లిలో ఎస్సీ సామాజికవర్గీయులతో సమావేశం. 10.45 గంటలకు తొండవాడ బహిరంగసభలో యువనేత ప్రసంగం. 11.45 గంటలకు తొండవాడలో భోజన విరామం. 12.45 గంటలకు భోజనవిరామ ప్రాంతంలో స్థానికనేతలతో అంతర్గత సమావేశం.

సాయంత్రం 3గంటలకు తొండవాడనుంచి పాదయాత్ర కొనసాగింపు. 4.30 గంటలకు చంద్రగిరి టవర్ క్లాక్ జంక్షన్ లో స్థానికులతో మాటామంతీ. 5.05 గంటలకు చంద్రగిరి నూర్ జంక్షన్‌లో స్థానికులతో భేటీ. 6.55 గంటలకు ఇత్తెపల్లిలో స్థానికులతో మాటామంతీ. 7.45 గంటలకు మామందూరు విడిది కేంద్రంలో బస.

ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ చూపాలి



ప్రజాశక్తి-పాలసముద్రం: మండల పరిధిలోని రైతులు ప్రకతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎన్.ఎఫ్ చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం శ్రీ కావ్య రాజపురంలో రైతులకు సర్పంచ్ గాలి మహేష్ బాబు సమక్షంలో ప్రకతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్. ఎఫ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు ప్రకతి వ్యవసాయంలో చెరుకు పంట సాగు చీడపీడల నివారణ, అధిక దిగుబడి కోసం జీవామతం వాడకం, కలుపు నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన క్లుప్తంగా వివరించారు. ఈ ప్రకతి వ్యవసాయంలో చెరుకు పంట సాగు చేసి అందులో వచ్చిన బెల్లం తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తామని తెలిపారు. ఇలాంటి బెల్లాన్ని మార్కెట్ ధర కన్నా ఐదు శాతం ఎక్కువగా టీటీడీ కొనుగోలు చేస్తుందని తెలిపారు. అందువలన ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిఆర్పి ఉష, ఐసిఆర్పి ప్రతాప్, మునియమ్మ, రైతులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం



ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని జనసేన పార్టీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైనట్లు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు అమీర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్క జనసేన కార్యకర్త సభ్యత్వానికి రూ.500 కట్టి తీసుకోవాలని, దీంతో ప్రమాద బీమా రూ. 5 లక్షలు ఉంటుందని తెలియజేశారు. ఏదైనా అనివార్య కారణాలవల్ల లేదా ప్రమాదవశాత్తు మరణించినట్లయితే రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన సైనికులు గణేష్ తదితరులు పాల్గొన్నారు

బీసీఎన్ విద్యా సంస్థల్లో వార్షికోత్సవాలు



ప్రజాశక్తి-గుడిపల్లి: బీసీఎన్ విద్యాసంస్థల్లోని కుప్పం పబ్లిక్ స్కూల్, జూనియర్ కళాశాలలో 20, 15 వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయ కులపతి డా.ఎ.కె.వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ గతంలో కుప్పం ఎంతో వెనుకబడిన ప్రాంతంగా ఉండేదన్నారు. కానీ తను పుట్టిన ఊరిని గొప్పగా చూడాలనుకునే ఉద్దేశంతో తన ఊరిలోనే ప్రజల కోసం బీసీఎన్ విద్యాసంస్థల అధినేత బి.సి .నాగరాజు విద్యాసంస్థలను ఏర్పాటు చేసి ఎంతోమందికి విద్యాదాతగా నిలుస్తున్నారన్నారు. చదువు అనేది మన గుర్తింపును ప్రపంచానికి తెలియపరుస్తుందని, ఆ విద్యతోనే ఇవాళ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చానని తెలిపారు. విద్య ఎంత ముఖ్యమో విద్యార్థినీ, విద్యార్థులకు ఆయన తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా.ఎ.కె. వేణుగోపాల్ రెడ్డిని బీసీఎన్ సంస్థల అధినేత బి.సి.నాగరాజు జ్ఞాపికతో సన్మానించి, కతజ్ఞతలు తెలిపారు. కెపిఎస్, కెజిసి ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్ మాట్లాడుతూ కుప్పం పబ్లిక్ స్కూల్ 20వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. కుప్పం జూనియర్ కళాశాల కూడా 15వ వార్షికోత్సవాన్ని జరుపుకోవడం శుభ పరిణామం అని తెలిపారు. ఆసియాస్ ట్విన్ జగ్లర్స్ అజయ్, ఆనంద్ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో బీసీఎన్ విద్యాసంస్థల అధినేత బిసి నాగరాజు, కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ సునీల్ రాజు, సీఈఓ సాగర్ రాజ్, కేజేసీ ప్రిన్సిపల్ సుప్రియ, కెపిఎస్ హెచ్ఎం దమయంతి, అసిస్టెంట్ హెచ్ఎం ప్రియా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో టిడిపిని అడ్డుకోలేరు...!

ప్రజాశక్తి-రామకుప్పం: కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఎవ్వరినీ ఆపలేరని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ ఆదివారం పేర్కొన్నారు. గత సంవత్సరంలో చంద్రబాబు కుప్పం పర్యటనలో వైసిపి నేతలు సష్టించిన అలజడితో తమపై అక్రమ కేసులు పెట్టారన్నారు. కోర్టు ఇచ్చిన కండిషన్ బెయిల్‌తో ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్‌లో సంతకాలు చేయాలని ఆదేశించడంతో నియోజకవర్గంలోని టిడిపి నేతలు పోలీస్ స్టేషన్ లో బెయిల్ పొందారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రాజకీయాలను రాజకీయంతోనే ఎదుర్కోవాలి తప్ప అక్రమ కేసులతో తెలుగుదేశం పార్టీని దెబ్బతీయలేరన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టిడిపిని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీని కలిసిన మండల నాయకులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మాజీ ఎమ్మెల్సీ దొరస్వామిని మండల టిడిపి నాయకులు ఆదివారం పిఇయస్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో కలిశారు. మాజీ ఏఎంసీ ఛైర్మన్ జయ చందర్ నాయుడు, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగరాజు గౌడ్, స్వామి దాస్, గిరిబాబు, శివశంకర్, కష్ణమూర్తి కలిసి ఆయన విద్యారంగానికి చేస్తున్న సేవలను అభినందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ దొరస్వామి మాట్లాడుతూ యూనివర్సిటీ ఛాన్సలర్ ఛైర్మన్ పిఇయస్ గ్రూప్ ఆఫ్ ఇన్సిట్యూషన్స్ బెంగళూరు, కుప్పం, చిత్తూరులలో పాఠశాల ప్రారంభించి విద్యార్థులకు విద్యా విధానాన్ని చేపడుతున్నామని గ్రామీణ ప్రాంత వాసులకు అవసరమైన విద్య అందించడంలో ముందుంటామన్నారు.



పూత నిలబడితే రైతులకు గిట్టుబాటు

ప్రజాశక్తి-కార్వేటినగరం: ప్రస్తుతం మామిడి తోటల్లో రైతులకు గిట్టుబాటు వచ్చేదానికి అవకాశం ఉంటుందని మామిడి రైతు లోకనాథం నాయుడు తెలిపారు. మండలంలో మామిడి రైతులు అధికంగా ఉన్నారని, వ్యవసాయ అధికారులు పూతదశలో ఎలాంటి మందులు, ఎంతా మోదులలో వాడాలి అనేది వివరించాలని కోరారు. గిట్టుబాటు ధర వచ్చేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. మామిడి తోటలలో పూత చాలా బాగా వచ్చిందన్నారు.



పడకేసిన పారిశుద్ధ్యం..!

◈ గ్రామాల్లో విజృంభిస్తున్న దోమలు ◈ రోగాల బారిన ప్రజలు ◈ పట్టించుకోని అధికారులు



ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఆ గ్రామ వీధులలో మురికి నీటి నిల్వలు ఉన్నాయి. గత నెల రోజులుగా ఇదే పరిస్థితి. స్థానిక సర్పంచ్‌కి, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. గ్రామస్తులు మీడియాకు చెప్పిన వివరాలు... చిత్తూరు జిల్లా, గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధి, వెదురుకుప్పం మండలం, కొమరగుంట దళిత వాడలో సుమారుగా 23 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఆ గ్రామంలో డ్రైనేజీ నీళ్లు వీధులపై పారుతున్నాయి. పల్లం ప్రాంతంలో ఒకచోట మురికి నీరు నిలిచి, ఒక మడుగు లాగా దర్శనమిస్తుంది. ఆ వీధుల్లో రోజూ గ్రామస్తులు అవతల వీధికి దాటుకుని వెళ్లాలి. సంబంధిత విషయమై పలుమార్లు స్థానిక సర్పంచికి, సచివాలయ సిబ్బంది దష్టికి బాధిత కుటుంబాల వారు తీసుకెళ్లారు. అయినా వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. మురికి నీటి నిల్వలపై దోమలు కుప్పలు తెప్పలుగా వాలుతున్నాయని అంటున్నారు. దీనివల్ల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆ గ్రామస్తుల వాపోయారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగు న్యాయం చేయాలని కోరుతున్నారు.

చెప్పినా పట్టించుకోలేదు



మా వీధిలో మురికి నీరు ఎక్కువగా నిల్వ ఉంది. శుభ్రం చేయండి అని సచివాలయ సిబ్బందికి చెప్పినా వారు పట్టించుకోలేదు. వినీ విననట్టుగా వెళుతున్నారు. ఏం చేయాలో తెలియడం లేదు.

- చంద్రబాబు కొమరగుంట దళితవాడ.

దుర్వాసన వస్తుంది



వీధుల్లో మురికినీరు వచ్చి చేరి చాలా రోజులుగా నిలిచి ఉండడంతో దుర్వాసనగా ఉంది. దీంతో ఇళ్లలో భోజనం చేయాలన్నా ఇబ్బందిగా ఉంది. అధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోండి.

- రాజేంద్ర, కొమరగుంట దళితవాడ.

వీధుల్లో నడవలేకపోతున్నాం



మా వీధిలో మురికి నీరు నిలిచిపోవడంతో ఇంట్లో నుండి వీధుల్లోకి వెళ్లాలంటేనే భయంగా ఉంది. సర్పంచి దృష్టికి తీసుకెళ్లినా సమస్యను తీర్చలేదు. సంబంధిత అధికారులు స్పందించి మా సమస్య పరిష్కరించండి.

- ఈశ్వరి, కొమరిగుంట దళితవాడ.

ఉరకలేసిన.. ఉత్సాహం



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని కొండ క్రింద పల్లెలో సంక్రాంతి పండుగ తర్వాత కూడా కోడె గిత్తల పరుగుల పందెం కొనసాగుతున్నాయి. ఆదివారం గ్రామస్తులు నడివీధిలో ఈ పరుగు పందాలను నిర్వహించారు. ఆనవాయితీగా మండలంలో ఈ పందేలు సంక్రాంతి పండుగ తరువాత పశువుల పండుగ రోజూ నిర్వహించేవారు. అయితే ఈ పశువుల పండుగ ఫిబ్రవరి నెలలో కూడా కొనసాగుతూనే ఉన్నాయి. ముందుగానే ఈ ఎడ్ల పందేలను నిర్వహించి సంబరాలు చేసుకుంటున్నారు. ఇక వివరాల్లోకి వెళితే.. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలోని వెదురుకుప్పం మండలం కొండ క్రింద పల్లెగ్రామంలో (జల్లికట్టు) నిర్వహించారు. ఈ పందేలను తిలకించడానికి పెద్దలు, యువకులు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ఆ గ్రామానికి తరలి వచ్చారు. అల్లీ వైపు వదిలే ఎద్దుల యజమానులు వాటి కొమ్ములకు ముందుగానే పట్టీలు, బెలూన్లు కట్టి సిద్ధం చేశారు. కొంతమంది ఎడ్ల యజమానులు వాటి కొమ్ములకు వెండి గొలుసులు కట్టి మరీ మైక్‌లో అనౌన్స్ చేయించి, దండోరా వేయించి అల్లీలో యువకుల వైపు వదిలారు. కొందరు యువకులు వాటిని నిలువరించే ప్రయత్నం చేశారు . కోడె గిత్తల పౌరుషం ముందు యువకులు తలొగ్గక తప్పలేదు. కొందరు యువకులు పోటీ పడి ఎద్దులను నిలువరించి బహుమతులను చేజిక్కించుకున్నారు. యువకుల చేయికి చిక్కకుండా పరుగులు తీసిన ఎద్దుల ఆ యజమాని సంతోషమే వేరప్పు....! యువకుల చేయి చిక్కి ఎద్దుల యజమానులు కొంత మనస్సు భారంగా, బాధగా ఇంటిముఖం పట్టారు. గ్రామస్తులు అందరూ కలిసి ఐక్యతతో ఈ పండుగను జరుపుకున్నారు. గ్రామంలో ఎద్దుల యజమానులకు దొడ్డి, భోజన సౌకర్యాన్ని గ్రామస్తులు కల్పించారు .ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు అని గ్రామస్తులు అంటున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లక్కనపల్లి లో 1995-1996 ఎస్ఎస్‌సి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నాడు పాఠశాల ఆవరణలో ఆనాటి ఉపాధ్యాయులు కేశవరెడ్డి, యూసఫ్ సమక్షంలో ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.రామాంజనేయులు, జగదీష్ కుమార్, కే.నాగరాజ, జై.మణి తదితరుల ఆధ్వర్యంలో కేకును కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సమ్మేళనంలో గురువులు శిష్యులకు భావి జీవితానికి పునాదులు, మీ పిల్లలకు అవసరమైన జీవనవిధానాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దడం మీ భాధ్యత అని అప్పటి ఉపాధ్యాయులు తెలియపరిచారు. విద్యార్థులు తమ పిల్లలతో వచ్చి సంతోషంగా స్నేహితులతో గడిపి భవిష్యత్తులో తమ పాఠశాలకు, మిత్రులకు తగిన సహాయ సహకారాలు అందివ్వాలని నిర్ణయించి, ప్రణాళికను తరువాతి సమ్మేళనంలో ప్రకటించ గలమని తీర్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జగదీష్ కుమార్, నాగేంద్ర రెడ్డి, మణి, నాగరాజు, రెడ్డి భాష, షాజహాన్, రమేష్, ఓబులరెడ్డి, క్రిష్ణప్ప, వేణుగోపాల్, శ్రీను, సుబ్రమణ్యం, సంజయ్, మంజుల, వేంకట లక్ష్మి, గౌరమ్మ, శ్యామల, విశ్వనాథ, చిన్నారెడ్డి, అనిత, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్‌లోని ఆయాల జీతాలు చెల్లించాలి



ప్రజాశక్తి-నగరి: పాఠశాలలో పనిచేయు ఆయాలకు పెండింగ్‌లోని జీతాలు చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. భోజనం మండల కమిటీ సమావేశం మండల యూనియన్ అధ్యక్షురాలు జమున అధ్యక్షతన ఆదివారం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల మంది ప్రభుత్వ పాఠశాలలో వంట కార్మికులకు పనిచేస్తున్నారు. కానీ ప్రభుత్వం మహిళా పక్షపాతం చెప్పుకుంటూ మహిళా కార్మికులకు జీతాలు పెంచడంలో నిర్లక్ష్యంగా ఉన్నారు. నెలకు రూ.3 వేలు ఇస్తున్నా వాటితో కుటుంబ పోషణ భారంగా మారుతున్నది. పెరుగుతున్న రోజువారీ ధరలకు అనుగుణంగా పిల్లలకు రోజుకి రూ.20 పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే వంట పాత్రలు, గ్యాస్ సిలిండర్‌లు ప్రభుత్వమే ఇవ్వాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మార్చి నెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో కార్మికులకు జీతాలు పెంచే విధంగా డబ్బులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఆయాలకు పెండింగ్‌లోని నాలుగు నెలల జీతాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలపైన అంశాల వారీగా పోరాట కార్యక్రమాలు రూపొందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు జమున, మహాలక్ష్మి, స్కూల్ స్వీపర్స్ యూనియన్ మండల కార్యదర్శి సరస్వతి, నాయకులు అలిమేలు, కుప్పమ్మ, బాలమ్మ, అనిత, మల్లికమ్మ, నాయకులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన జిల్లా వైసీపీ యువజన అధ్యక్షుడు హేమంత్ రెడ్డి



ప్రజాశక్తి-సోమల: జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు హేమంత్ రెడ్డి ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. సోమల మండలం వల్లిగట్ల గ్రామానికి చెందిన హేమంత్ రెడ్డి తనకు వైసిపి యువజన విభాగం అధ్యక్ష పదవిని ఇచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి జీవితకాలం రుణపడి ఉంటానన్నారు. రాబోయే ఎన్నికలలో మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా చూడాలన్నదే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.

బోయకొండ గంగమ్మ సేవలో ప్రముఖులు



ప్రజాశక్తి-చౌడేపల్లె: మండలంలోని దిగువపల్లె పంచాయతీలో వెలిసిన ప్రముఖ శక్తిక్షేత్రంగా విరజిల్లుతున్న కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన బోయకొండ గంగమ్మ దేవస్థానం ఛైర్మన్ మిద్దింటి శంకర నారాయణ చేతుల మీదుగా ఆదివారం వందే విశ్వ భారత్ వీర పురస్కార్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అమ్మ సింధూమాత (కాళీ మాత) ఉపాసకురాలు, విశ్వ భారత్ మీడియా ఛైర్మన్ బలివాడ రమేష్, విశ్వ భారత్ మీడియా సబ్ ఎడిటర్ శ్రీనివాస్‌లు దేవస్థానానికి విచ్చేశారు. అదే విధంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడు తున్న గోశాలకు అయ్యవారు కొత్తపల్లి, బంగారు పేటకు చెందిన కె.సొన్నప్ప ఆవుదూడ విరాళంగా ఇచ్చారు. వారికి అర్చకులు తీర్థ ప్రసాదములు అందజేసి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి, పాలక వర్గ సభ్యులు పూర్ణిమ రాయల్ మోహన్, దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చేపల చెరువులకు వేలం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని అన్నెమ్మగారిపల్లి, పేటూరు, పెద్ద ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలోని చేపల చెరువులకు పంచాయతీ కార్యాలయంలో నేడు వేలం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శులు లలిత కుమారి, మసూద బేగం తెలిపారు. పెద్ద ఉప్పరపల్లి, ఎల్లమ్మ చెరువు, అన్నెమ్మగారిపల్లి పంచాయతీలో పెద్ద చెరువు, ఎగువ చెరువు, నాగమ్మ చెరువు, దోనమాకుల చెరువు, గడ్డిమాను ఒడ్డు, పేటూరు పంచాయతీలో రెడ్డి చెరువు ఒడ్డు, కొత్తచెరువు, కనిగెల చెరువు, వెంకటప్ప చెరువు, శీలం చెరువులకు వేలం నిర్వహించనున్నట్టు, ఆసక్తి కలవారు చేపల చెరువుల వేలంలో పంచాయతీ సూచించిన నియమ నిబంధనల మేరకు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చునని వారు తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్ల మతి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వీధి కుక్కల దాడిలో గొర్రెపిల్ల మృతి చెందిన సంఘటన మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఉమాకర్ రెడ్డి గొర్రె పిల్లను వీధి కుక్కలు దాడి చేసి చంపాయి. దీంతో వీధి కుక్కలు గుంపుగా కనిపిస్తే గ్రామస్తులు హడలిపోతున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుంచి గ్రామస్తులను కాపాడాలని కోరుతున్నారు.

గ్రామాన్ని విస్మరించిన పాలక వర్గం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: కార్వేటి నగరం మండలం, కార్వేటి నగరం పంచాయతీ, గాజుల కండ్రిగ గ్రామంలో జనం కోసం జనసేన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి యుగంధర్ పొన్న మాట్లాడుతూ గాజుల కండ్రిగ గ్రామాన్ని పాలక వర్గం విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎంతో మంది రాజకీయ నాయకులు, పాలకులు రోడ్డు వేస్తామని ఎన్నో హామీలిచ్చారు కానీ నెరవేర్చలేక పోయారని తెలిపారు. ఓట్ల కోసం వచ్చిన వాళ్లంతా ఉత్తుత్తి హామీ లిచ్చారని, చివరికి మరిచారని ఎద్దేవా చేశారు. గత 30 సంవత్సరాలుగా మంచి రోడ్డు లేక ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజల సమస్యను చిత్తూరు జిల్లా కలెక్టర్ స్పందించి, సకాలంలో రోడ్డు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నెల రోజుల్లో రోడ్డు వేయకపోతే గ్రామం కోసం ఆమరణ దీక్ష చేస్తానని తెలిపారు. గ్రామీణ రహదారుల ఏర్పాటు జనసేనకే సాధ్యమని, ఒక్క అవకాశం జనసేనకు ఇవ్వమని గ్రామ ప్రజలను కోరారు. ఏపీలో పవన్ కళ్యాణ్ స్వర్ణయుగం తీసుకొస్తారని, పవన్ కళ్యాణ్ చేస్తున్న సేవలను తెలియజేసారు. కార్యకర్తల కోసం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. దీనిని జనసైనికులు, మహిళలు, సాధారణ ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ, మండల ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పటి వరకు పవన్ కళ్యాణ్ ప్రమాద వశాత్తు మరణించిన 92 మంది కార్యకర్తల కుటుంబాలకు రూ.4 కోట్లు 80 లక్షలు ఇచ్చారని తెలిపారు. గాయపడిన 169 మంది జనసైనికులకు రూ.60,90,781లు ఇచ్చారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో జనసేన జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు విజయ్, నాయకులు దేవ, కిరణ్ మరియు జనసైనికులు పాల్గొన్నారు.

ఏడెకరాల చెరకుతోట దగ్ధం



ప్రజాశక్తి-నగరి: మున్సిపల్ పరిధి నగరిపేట సమీపంలో హనీఫా సాహెబ్ 4 ఎకరాల చెరకు తోట అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఆదివారం సాయంత్రం అకస్మాత్తుగా తోటలో నుంచి మంటలు పుట్టుకొచ్చాయి. దీంతో అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియడం లేదు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి విచ్చేసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే పంట అగ్నికి ఆహుతైంది.

నేటి నుంచి శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవుల పల్లె గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నేటి నుండి మార్చి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టిటిడి అధికారులు తెలిపారు. నేడు అంకురార్పణ, 28వ తేదీ ధ్వజారోహణం, సూర్య ప్రభ వాహనం, మార్చి 1న హనుమంత వాహనం, 2న సింహ వాహనం, 3 న శేష వాహనం, 4 న మోహినీ ఉత్సవం, గజవాహనం, 5 న కళ్యాణోత్సవం, గరుడసేవ, 6 న రథోత్సవం, డోలోత్సవం, 7 న అశ్వ వాహనం, పార్వేట ఉత్సవం, దోపు ఉత్సవం (తిరుమంగై అల్వార్), 8 న వసంతోత్సవం, చక్రస్నానం, హంస వాహనం, ధ్వజా అవరోహణం, 9 న శయనోత్సవం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు టిటిడి అధికారులు తెలియజేశారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకుని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

వ్యక్తి దారుణహత్య



ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఊటుపల్లి పంచాయతీ బొమ్మిరెడ్డి గారి పల్లికి చెందిన శేషారెడ్డి తిరుపతిలో కాపురం ఉంటూ తరచూ గ్రామానికి వచ్చి పొలం పనులను చూసుకుని వెళ్లేవాడు. ఈ క్రమంలో ఆదివారం జెసిబి తో పొలం వద్ద పనిచేయించేందుకు వెళ్లాడు. ఊటుపల్లి పంచాయతీ చల్లా వారిపల్లెకు చెందిన రవికుమార్(39) గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం మధ్యాహ్నం శేషారెడ్డి పొలం పనులు చేయిస్తూ ఉండగా అటుగా వెళుతున్న రవికుమార్ శేషారెడ్డిని చాలా రోజుల తర్వాత చూడడం, శేషారెడ్డి పొలం ప్రక్కనే మతుడి పొలము ఉండడం కారణంతో ఏం అన్న బాగున్నావా ? అని అడిగాడు. మద్యం మత్తులో ఉన్న శేషారెడ్డి వెంటనే ఆవేశంతో రవికుమార్ తలపై పెద్ద కర్రతో బలంగా కొట్టడంతో రవికుమార్ అక్కడికక్కడే మతి చెందాడు. సమీపంలోని రైతులు సంఘటనా స్థలానికి చేరుకుని రవికుమార్‌ను ఆసుపత్రికి తరలించాలని ప్రయత్నించగా అప్పటికే మతి చెందడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ మారుతి సంఘటన స్థలానికి వెళ్లి రవికుమార్ మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మతుడి భార్య హేమావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రవికుమార్ మతితో చలావారిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. శేషారెడ్డి పరారీలో ఉన్నట్టు సమాచారం.

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ గురికాని వారి పల్లెకు చెందిన ముగ్గురు వ్యక్తులు నాటు సారా అమ్ముతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం ఉదయం స్థానిక పోలీసులు దాడి చేసి వారి వద్ద 240 నాటు సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని గురుస్వామి, మల్లికార్జున, రెడ్డప్ప అనే ముగ్గురిని అరెస్టు చేసి, వారిని రిమాండ్ నిమిత్తం పుంగనూరు కోర్టుకు తరలించినట్టు సోమల పోలీసులు తెలియజేశారు. నాటుసారా తయారు చేయడం, అమ్మడం చట్టరీత్యా నేరమని, అలా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి 100 పనులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ శాఖ డీఈ మల్లవరం దయాకర్ రెడ్డి ఆదివారం తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నియోజవర్గంలోని 24 సచివాలయాల పరిధిలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి పర్యటించగా ఆయన ఆదేశాల మేరకు ప్రత్యేకించి పంచాయతీరాజ్ శాఖ ద్వారా కమ్యూనిటీ హాల్స్ భవనాలు, అసంపూర్తి పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణానికి, కాల్వలకు కల్వర్టులు, బ్రిడ్జీల నిర్మాణానికి రూ.3.92కోట్లతో 100 పనులు మంజూరైనట్లు తెలిపారు.

ఫోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: విద్యార్థినుల నుండి మహిళల వరకు ఫోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ దమయంతి, అడ్వకేట్ చిత్ర కోరారు. బంగారెడ్డిపల్లి సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఫోక్సో చట్టంపై అడ్వకేట్ చిత్ర పలు అంశాలపై వివరించారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ రెడ్డి శ్రీ, టీచర్లు ఇందుమతి, రూప, మల్లీశ్వరి, పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ కొండ ఆలయ ధర్మకర్తగా నాగరాజరెడ్డి



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: సిద్ధేశ్వర కొండ గ్రామంలోని శ్రీ ప్రసన్న పార్వతి సమేత శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయానికి ధర్మకర్తగా ఎన్ నాగరాజారెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. గతంలో ఈ ఆలయానికి వేట్కూరు పల్లెకు చెందిన మునిరత్నం రెడ్డి ఆలయ ధర్మకర్తగా వ్యవహరించారు. ఈయన కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. దీంతో ఆలయానికి కొత్త ఆలయ ధర్మకర్తగా వి.లక్ష్మిరెడ్డిపల్లికి చెందిన ఎన్.నాగరాజారెడ్డిని స్థానిక పెద్దలు, పలువురు కలిసి ఎన్నుకున్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రామచంద్రపురం మండలం అనుపల్లి కి చెందిన బొడ్డు రూపసుందరయ్య(47) తిరుపతి రుయా హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఆదివార సాయంత్రం తుది శ్వాస విడిచారు. మూడు రోజుల క్రితం వెదురు కుప్పం మండలం కమ్మ కండ్రిగలో బంధువు చనిపోతే అనుపల్లి గ్రామం నుంచి బంధువులు ఒక ప్రైవేటు వాహనంలో వెళుతూ ఉండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 20 మందిపై గాయపడ్డారు. అనుపల్లి కి చెందిన రూప సుందరయ్య తీవ్ర గాయాలు పాయలయ్యారు.. చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆదివారం సాయంత్రం మరణించారు. అనుపల్లి గ్రామం శోకసముద్రమైంది..